
సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 6 । జూన్ । 2023



సాగు పెరిగి..ధర తగ్గి..
ఈ ఏడాది టమాటాకు మంచి ధరలు ఉంటాయని భావించిన రైతులకు నిరాశే ఎదురైంది. సాగు పెరిగినా ధర తగ్గడంతో ఆందోళన చెందుతున్నారు. - 8లో



రాకపోకలకు ఇసుక టిప్పర్ బ్రేక్!
రాయచోటి-రాజంపేట ఘాట్‌రోడ్ మలుపులో టిప్పర్ ఆగిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.220	రూ.280
రెండోరకం	రూ.140	రూ.210

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1602 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కలికిరి: మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల బాలికల గురుకుల పాఠశాలలో బ్యాక్ లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వై.సోమశేఖర్ తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో బీసీ-డి 2, బీసీ-ఈ 1, ఎస్సీ-1, ఎస్టీ-1, 7వ తరగతిలో బీసీ-డి 1, బీసీ-ఈ 2, 8వ తరగతిలో బీసీ-డి 1, బీసీ-ఈ 1, 9వ తరగతిలో బీసీ-ఈ 2 సీట్లు ఖాళీలున్నాయని తెలిపారు. ఇంగ్లీషు మీడియం చదువుతున్న విద్యార్థినులు స్టడీ, కుల ధ్రువీకరణ పత్రంతో ఈ నెల 7 నుంచి 13వ తేదీ లోపు దరఖాస్తులు పొంది, 15వ తేదీ లోపు పాఠశాలలో సమర్పించాలని పేర్కొన్నారు. కలికిరి పాఠశాలలో 20న ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు.

టోల్‌గేటు వసూళ్లపై విచారణ

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ వెళ్లే వాహనాల నుంచి వసూలు చేసే టోల్‌గేటుపై సోమవారం రాయచోటిలో ఎస్పీ గంగాధరరావు విచారించారు. అధికంగా టోల్ వసూలు చేస్తున్నారన్న ఆరోపణలపై క్షేత్ర స్థాయిలో వివరాలు సేకరించినట్టు తెలిసింది. దీనిపై మదనపల్లె ఆర్డీఓ ఎంఎస్.మురళీ జారీచేసిన ప్రొసీడింగ్స్ మేరకు బైక్‌కు రూ.30, ఆటోకు రూ.70, కారుకు రూ.100, మినీబస్సుకు రూ.170, బస్సు, లారీకి రూ.170 వసూలు చేస్తున్నామని గుత్తదారులు ఎస్పీకి వివరించారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వచ్చేవారిని కొండపైకి పంపవద్దని, భద్రతా చర్యలు పాటించాలని ఎస్పీ సూచనలు చేశారు.

నేడు జాబ్ డ్రైవ్

రాయచోటి: రాయచోటి డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హర్షలత ఒక ప్రకటనలో తెలిపారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, ఐసీఐసీఐ బ్యాంకు, టీవీఎస్, టీఎస్‌ల సౌజన్యంతో మంగళవారం జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏదైనా డిగ్రీ, డిప్లొమా, బీసీఏ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యు కోర్సులు పూర్తిచేసి 25 సంవత్సరాలు వయో పరిమితి కల్గిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్ కో-ఆర్డినేటర్ టి.వెంకటరమణ, హెచ్‌ఆర్ కిరణ్, జేకేసీ మెంటార్ సుధీర్‌ల పర్యవేక్షణలో జాబ్ డ్రైవ్ నిర్వహిస్తారన్నారు. వివరాలకు 9566177753, 89199118000 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఊటీకి ప్రత్యేక బస్సు సర్వీసు

మదనపల్లె సిటీ: మదనపల్లె వన్, టు డిపోల పరిధిలో వేసవి సెలవులు ముగింపు పురస్కరించుకుని ఊటీకి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు డిపో మేనేజర్లు మూరే వెంకటరమణారెడ్డి, ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. 9న మదనపల్లెలో బయలుదేరి బెంగళూరు, మైసూర్, పైకారా షూటింగ్ స్పాట్, ముడిమలై టైగర్ రిజర్వు, బండిపూర్ ఫారెస్టు, మైసూర్ ప్యాలెస్, జువాలజికల్ పార్కు, బృందావన్ గార్డెన్స్‌ను సందర్శిస్తారన్నారు. 10న వన్ డిపో నుంచి ఊటీకి సూపర్ లగ్జరీ బస్సు నడపనున్నట్లు వారు తెలిపారు. రానుపోను చార్జి రూ.2,250 చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 944164104, 9440249483 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రతి విద్యార్థికి విద్యా కానుక

ఒంటిమిట్ట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న జగనన్న విద్యాకానుక ప్రతి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థికి తప్పక అందించాలని ఆర్‌జేడీ వెంకటకృష్ణారెడ్డి ఆదేశించారు. సోమవారం ఒంటిమిట్టలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిల్వ చేసిన విద్యా కానుక కిట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఇచ్చే పాఠశాల యూనిఫామ్ నాణ్యత గురించి స్థానిక ఎంఈఓను అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓ వెంకటసుబ్బయ్య, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేమన వెలుగులు..!



యోగివేమన విశ్వవిద్యాలయం

- టాప్-200 విశ్వవిద్యాలయాల్లో వైవీయూకు చోటు
- ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్‌లో 151-200 శ్రేణి
- మరింత మెరుగైన ర్యాంకింగ్ కోసం యత్నిస్తామంటున్న అధికారులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం ఖ్యాతి మరోసారి జాతీయ స్థాయిలో రెపరెపలాడింది. భారత విద్యామంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో సోమవారం విడుదల చేసిన విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్‌లో టాప్-200లో వైవీయూ చోటు దక్కించుకుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌ఐఆర్‌ఎఫ్)-2023 వారు ప్రకటించిన ర్యాంకింగ్‌లో యోగివేమన విశ్వవిద్యాలయం 151 నుంచి 200 శ్రేణి ర్యాంకింగ్‌లో చోటు దక్కించుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని నూతన విశ్వవిద్యాలయాల్లో వైవీయూకు మాత్రమే ఈ ర్యాంకింగ్‌లో చోటు దక్కడం విశేషం. విశ్వవిద్యాలయాలకు ర్యాంకింగ్ ఇచ్చేందుకు 5 అంశాలను ప్రామాణికంగా తీసుకుని ర్యాంకును కేటాయిస్తారు. 1. బోధన, అభ్యసన వనరులు, 2. పరిశోధన, వృత్తిపరమైన సాధన, 3. గ్రాడ్యుయేషన్ అవుట్ కమ్, 4. సమ్మిళిత ప్రగతి ఫలితాలు 5. జ్ఞానం, అవగాహన (పర్సెప్షన్) అంశాల ఆధారంగా ర్యాంకింగ్ కేటాయిస్తారు. తాజాగా విడుదలైన ర్యాంకింగ్‌లో 1-100 ర్యాంకుల్లో మన రాష్ట్రం నుంచి ఆంధ్ర, ఎస్వీయూలు మాత్రమే చోటు దక్కించుకున్నాయి. 151-200 శ్రేణి స్థానాల్లో తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, యోగివేమన విశ్వవిద్యాలయాలు మాత్రమే సంప్రదాయ విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్ జాబితాలో చోటు దక్కించుకున్నాయి.

పోటీలో తట్టుకుని.. చోటు దక్కించుకుని..

ఎన్‌ఐఆర్‌ఎఫ్‌కు దేశవ్యాప్తంగా 2022-23 విద్యాసంవత్సరానికి గాను 8686 విద్యాలయాలు దరఖాస్తు చేసుకోగా.. ఎన్‌ఐఆర్‌ఎఫ్ ప్రమాణాలను అనుసరించి ర్యాంకింగ్ ప్రకటించారు. ఏపీ నుంచి సంప్రదాయ విశ్వవిద్యాలయాల్లో టాప్-200లో కేవలం 4 విశ్వవిద్యాలయాలు మాత్రమే ఉండగా అందులో వైవీయూ చోటు దక్కించుకోవడం గమనార్హం. కాగా 2017లో ప్రకటించిన ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్‌లో వైవీయూ టాప్-100లో చోటు దక్కించుకుని 92వ స్థానంలో నిలిచి ఏపీలో టాప్-3గా నిలిచి చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. అయితే ఆ తర్వాత యేడాది నుంచి ఎక్కువ సంఖ్యలో విద్యాలయాలు, విశ్వవిద్యాలయాల నుంచి పోటీ తీవ్రత పెరగడంతో వైవీయూ టాప్-200లోపే పరిమితమైంది. యోగివేమన విశ్వవిద్యాలయం తిరిగి టాప్-100లోపు ర్యాంకు సాధించాలంటే అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు తగిన కార్యాచరణ చేపడితే కష్టమేమీ కాదని నిపుణులు పేర్కొంటున్నారు. బోధన, పరిశోధన, పరిశోధక వ్యాసాలు, మౌలిక సదుపాయాలు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, ప్లేస్‌మెంట్స్, ఉన్నత విద్యాభ్యాసం, విశ్వవిద్యాలయ పరీక్షల నిర్వహణ, పీహెచ్‌డీ విద్యార్థులు, రీసెర్చ్ ప్రాజెక్టులు, పబ్లికేషన్స్, సైటేషన్స్, పేటెంట్స్, మహిళల ప్రాధాన్యం తదితర అంశాలపై దృష్టి సారిస్తే మరింత మెరుగైన ర్యాంకింగ్ సాధ్యమేనని వైవీయూ అధికారులు పేర్కొంటున్నారు.

ప్రత్యేక దృష్టి సారిస్తాం..



యోగివేమన విశ్వవిద్యాలయానికి 150లోపు ర్యాంకింగ్ వస్తుందని భావించాం. 151 నుంచి 200లోపు ర్యాంకు రావడం సంతోషకరమే అయినప్పటికీ మరింత మెరుగైన ర్యాంకు సాధించేందుకు కృషిచేస్తాం. అధ్యాపకుల వృత్తిపరమైన నైపుణ్యాలు పెంపు, ఆన్‌లైన్ ఎడ్యుకేషన్, ప్లేస్‌మెంట్స్, రీసెర్చ్, పబ్లికేషన్స్, సైటేషన్స్, పేటెంట్స్, ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారిస్తాం.
– ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్, వైవీయూ

మరింత మెరుగైన ర్యాంకింగ్ కోసం కృషి..



యోగివేమన విశ్వవిద్యాలయం ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్‌లో జాతీయస్థాయిలో 151-200 శ్రేణిలో నిలవడం సంతోషంగా ఉంది. అయితే టాప్-100 విశ్వవిద్యాలయాల్లో వైవీయూను నిలిపేలా కృషిచేస్తాం. రానున్న రోజుల్లో మరింత మెరుగైన ర్యాంకింగ్ సాధిస్తాం.
– ఆచార్య చింతా సుధాకర్, వైస్ చాన్సలర్, వైవీయూ

అర్జీలకు సత్వర పరిష్కారం

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం ద్వారా అందిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ 'జగనన్నకు చెబుదాం-స్పందన' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జేసీ ఫర్మాన్ అహ్మద్, డీఆర్‌ఓ సత్యనారాయణలు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. దరఖాస్తులు పెండింగ్ ఉండరాదన్నారు.

అతిసారా నియంత్రణకు ప్రత్యేక చర్యలు

జిల్లాలో అతిసారాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఇందు కోసం ఈ నెల 17వ తేదీ వరకు అతిసారా నియంత్రణపై జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో అతిసార నియంత్రణ కార్యక్రమాలపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. పిల్లలకు విరేచనాలు అవుతున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా ఆశా, ఏఎన్‌ఎంల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఎన్‌సీడీ-సీడీ సర్వే లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా జలశక్తి అభియాన్ కార్యక్రమాలు

జలశక్తి అభియాన్ కార్యక్రమాలను జిల్లాలో విస్తృతంగా అమలు చేసి నీటి వనరులను పెంపొందించేందుకు అన్నిశాఖలు సమన్వయంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో జరుగుతున్న జలశక్తి అభియాన్ కార్యక్రమాలు, జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారంపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో నీటి పొదుపు చర్యలను పటిష్టంగా అమలు పరచాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఎఫ్‌ఓ వివేక్, డీఆర్‌ఓ సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై కూర్చుని.. సమస్యను సావధానంగా ఆలకించి..

రాయచోటి కలెక్టర్‌లో సోమవారం జగనన్నకు చెబుదాం ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం జరిగింది. వీరబల్లి మండలం వంగిమళ్లకు చెందిన వికలాంగురాలు ఎస్.జరీనాబేగం పాకుతూ.. అర్జీ సమర్పించడానికి హాలులోకి వచ్చింది. దీనిని గమనించిన జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అర్జీదారురాలు వద్దకే వచ్చి నేలపై మోకాళ్ల మీద కూర్చుని.. సావధానంగా ఆమె సమస్యను ఆలకించారు. చిన్నప్పుడు పోలియో వల్ల తన రెండు కాళ్లు చచ్చుబడిపోయాయని.. నడవలేని స్థితిలో ఉన్నానని. మూడు చక్రాల వాహనం మంజూరు చేయాలని వేడుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అర్హతలను పరిశీలించి ఆమెకు వెంటనే మూడు చక్రాల వాహనం మంజూరు చేయాలని జిల్లా వికలాంగ సంక్షేమ శాఖ అధికారికి జాయింట్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. జాయింట్ కలెక్టర్ స్పందించిన తీరు అందరి ప్రశంసలు అందుకుంది.


మోకాళ్లపై కూర్చుని అర్జీదారుల సమస్యను సావధానంగా ఆలకించిన జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

స్టేట్ గెస్ట్‌హౌస్ ఆవరణలో మొక్కలు నాటిన కలెక్టర్, ఎమ్మెల్యే

రాయచోటి: రోజురోజుకు దెబ్బతింటున్న పర్యావరణాన్ని పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిలు పిలుపునిచ్చారు. సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో నూతనంగా నిర్మించిన స్టేట్ గెస్ట్ హౌస్ ఆవరణంలో సోషల్ ఫారెస్ట్రీ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, రాయచోటి ఎమ్మెల్యే, జాయింట్ కలెక్టర్, మున్సిపల్ చైర్మన్‌లు కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ అతిథులు బస చేసేందుకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు రాయచోటిలో అధునాతన టెక్నాలజీతో నూతన గెస్ట్ హౌస్ నిర్మించడం గర్వకారణమన్నారు. విశాలమైన గెస్ట్‌హౌస్ ఆవరణతోపాటు చుట్టుపక్కల కూడా పచ్చదనాన్ని పెంపొందించడంలో భాగంగా విరివిగా మొక్కలు నాటాలని సోషల్ ఫారెస్ట్రీ డీఎఫ్‌ఓకు సూచించారు. నీటి వసతి ఏర్పాటు కోసం బోరు, సంపు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే కలెక్టరేట్ సమీపంలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద కూడా పచ్చదనం, మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సోషల్ ఫారెస్ట్రీ డీఎఫ్‌ఓను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, సోషల్ ఫారెస్ట్రీ డీఎఫ్‌ఓ నాగమునేశ్వరి, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, తహసీల్దార్ ఎస్.ప్రేమంత్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు సోషల్ ఫారెస్ట్రీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


స్టేట్ గెస్ట్ హౌస్ ఆవరణంలో మొక్కలు నాటుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి తదితరులు


మొక్కలను నాటుతున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొండయ్య

ప్రకృతిని కాపాడదాం

రాయచోటి అర్బన్: ప్రకృతిని కాపాడడం ద్వారా ఆరోగ్యంగా జీవిద్దామని డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ కొండయ్య పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం ఆవరణంలో ఆయన మొక్కలను నాటా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిదీ అన్నారు.

జీవనశైలిలో మార్పుతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం

రాజంపేట: జీవనశైలిలో మార్పుతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని జిల్లా అటవీశాఖాధికారి పి.వివేక్ అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో రాజంపేటలో జిల్లాలోని అటవీ సిబ్బందితో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్లాస్టిక్ వీలైనంతవరకు తగ్గించుకొని పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. అనంతరం జిల్లా అటవీశాఖ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. అక్కడ అటవీ అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌ఓ నారాయణ(రాజంపేట), ప్రభాకర్‌రెడ్డి(బాలపల్లె), కె.పీరయ్య(సానిపాయి), ట్రైనీ ఎఫ్‌ఆర్‌వో దీరజ్, రఘునాథరెడ్డి(రైల్వేకోడూరు)తోపాటు జిల్లాలోని డిప్యూటీ రేంజర్లు, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లు, ఎఫ్‌బీఓ, ఏబీఓలు, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.


పర్యావరణ పరిరక్షణ దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అటవీశాఖాధికారి వివేక్

సాక్షి మీడియా గ్రూప్, ఆర్.సి ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో

గ్రూప్-2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

- జూన్ 10వ తేదీ (శనివారం) ఉదయం 09:00 నుంచి 12:30 వరకు
- టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్

సాక్షి ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఎత్తున గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేప డుతుంది. దాదాపు 1000 వరకు గ్రూప్-2 ఉద్యో గాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో.. గ్రామీణ విద్యా ర్థులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో.. సాక్షి ఎడ్యుకేషన్.కామ్ (www.sakshi education .com) రాష్ట్రంలోని ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఆర్.సి ఎగ్జామ్స్ కలిసి జూన్ 10వ తేదీ(శనివారం) ఉదయం 09:00 నుంచి 12:30 వరకు కడపలోని Haritha Hotel, Kotireddy Circle, Opposite: S P Bungalow నందు ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. గత కొన్నేళ్లుగా వివిధ పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం అందరికి తెల్సిందే.

లెజండరీ ఫ్యాకల్టీతో..: ఈ అవగాహన సదస్సుకు రాష్ట్రంలోనే లెజండరీ ఫ్యాకల్టీలైన బి.కృష్ణారెడ్డి (పాలిటీ), అబ్దుల్ కరీం(హిస్టరీ), సి.హరికృష్ణ (సైన్స్ అండ్ టెక్నాలజీ), ఎండీ పాషా (ఎకానమీ), ప్రొ. చింతా గణేష్ (సోషియాలజీ), మట్టపల్లి రాఘవేంద్ర(కరెంట్‌అఫైర్స్), శంకర్ రెడ్డి(మెంటల్ ఎబిలిటీ), జల్లు సద్గుణరావు (జాగ్రఫీ) లాంటి లెజండరీ ఫ్యాకల్టీలు హాజరుకానున్నారు. అవగాహన సదస్సుతో పాటు.. అదే రోజు టాలెంట్ టెస్ట్ నిర్వహించి జిల్లాలో మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నారు.

- త్వరలోనే వెయ్యికి పైగా గ్రూప్ 2 ఉద్యోగాలకు నోటిఫికేషన్ రానుండటం.. దీనికి తోడు గ్రూప్-2కు కొత్త సిలబస్‌ను ప్రకటించిన నేప థ్యంలో ఈ అవగాహన సదస్సులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడను న్నాయి. అవ గాహన సదస్సు, టాలెంట్ టెస్ట్ కు హాజరయ్యే విద్యార్థులు ముందుగా 8985094499 ఫోన్ నెంబర్‌కు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపాలి.

అవగాహన సదస్సు తేదీ : జూన్ 10, 2023 (శనివారం)
వేదిక: హరిత హోటల్, కోటిరెడ్డి సర్కిల్, ఎస్పీ బంగ్లా ఎదురుగా, కడప
సమయం: ఉదయం 09:00 నుంచి 12:30 వరకు

వంగ సాగు.. బతుకు బాగు

- ఐదునెలల తరువాత పుంజుకొన్న ధరలు
- మార్కెట్లో కిలో వంగధర రూ.40
- కర్ణాటక, తమిళనాడుల్లో మంచి డిమాండ్
- లాభాల బాటలో రైతులు

గుర్రంకొండ: జిల్లాలో టమాటా, పూలతోటల సాగుతో నష్టపోయిన రైతులను ప్రస్తుతం వంగ సాగు ఆదుకుంటోంది. సుమారు ఐదు నెలల తరువాత మార్కెట్లో వంగ ధరలు పుంజుకున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో వంగ ధర రూ.40 వరకు పలుకుతుండడం గమనార్హం. మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రస్తుతం మంచి డిమాండ్ ఉంది. దీంతో జిల్లాలో వంగసాగు రైతుల కష్టాలు తీర్చి మంచి లాభాలు తీసుకొస్తోంది.

జిల్లాలో 2650 హెక్టార్లలో సాగు

జిల్లాలో ఈ సీజన్‌లో 2650 హెక్టార్లలో వంగ తోటల సాగు చేపట్టారు. ఎకరం సాగుకు దుక్కుల దగ్గర నుంచి కాయలు కోతకు వచ్చేంత వరకు రూ. 80 వేలు నుంచి రూ.లక్ష వరకు ఖర్చు వస్తుంది. చెట్టు ఎదుగుదలకు, పూతపిందె నిలవడానికి వారానికి ఒక సారి మందులు పిచికారీ చేయాల్సి ఉంటుంది. చెట్టుకు సత్తువ ఇచ్చి కాయలు ఎక్కువ కాయడానికి పురుగుల మందు కోసం ప్రతి వారం సుమారు రూ. 6 వేలు నుంచి రూ.8 వేలవరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. మొక్కలు నాటిన 90 రోజులకు కాయలు కాయడం మొదలవుతుంది. సుమారు మూడు నెలల పాటు కాయల కోత ఉంటుంది.


చెరువుమొరవపల్లెలో సాగు చేసిన వంగతోటలు


రవాణాకు సిద్ధంగా ఉంచిన వంకాయలు

ఎకరానికి రూ.4 లక్షల నుంచి రూ.4.80 లక్షలు ఆదాయం

వంగతోటలు సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుంది. తద్వారా ఎకరానికి కనీసం రూ.4 లక్షల నుంచి గరిష్టంగా రూ.4.80 లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఎకరానికి 10 నుంచి 12 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో కిలో వంగ రూ. 22 వరకు ధరలు పలుకుతున్నాయి. అంకూర్ మిగిలిన రకాలు కిలో రూ. 15 నుంచి రూ. 25 వరకు ధరలు పలుకుతున్నాయి. మార్కెట్లో మొదటి రకం కిలో రూ. 40, రెండో రకం కిలో రూ. 32, మూడో రకం కిలో రూ.28 వరకు ధరలు పలుకుతున్నాయి. ఈ లెక్కన ఎకరానికి రూ. 4 లక్షలు నుంచి రూ.4.80లక్షల వరకు ఆదాయం వస్తుంది. గత ఇరవై రోజులుగా ఇవే ధరలు మార్కెట్లో నిలకడగా ఉండడంతో రైతులు ఇప్పుడిప్పుడే లాభాల బాట పడుతున్నారు.

ఐదునెలల తరువాత పుంజుకొన్న ధరలు

సుమారు ఐదు నెలల తరువాత మార్కెట్లో వంగ ధరలు పుంజుకొన్నాయి. ఐదునెలల క్రితం ధరలు పతనమవడంతో పలువురు రైతులు తోటలు దున్నేశారు. గతంలో తమిళనాడు రాష్ట్రంలో అక్కడి తోటలు భారీగా దెబ్బతిని దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. దీంతో మన జిల్లా వంగకు అక్కడి మార్కెట్లలో మంచి డిమాండ్ ఏర్పడింది. దీనికితోడు నెలల తరబడి ధరలు పుంజుకోక పోవడంతో రైతులు డీలాపడ్డారు. సాధారణంగా వేసవి సీజన్‌లో తమిళనాడులో వంగకు మంచి డిమాండ్ ఉంటుంది. దీంతో పాటు తమిళనాడులో పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఎక్కువగా మన జిల్లాలో వంగ ఎగుమతి చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలో వంగతోటలు అంతంత మాత్రంగా ఉండడంతో మన జిల్లా వంగ అక్కడికి ఎగుమతి అవుతోంది. ఓవైపు దిగుబడి లేక పోవడంతో మరోవైపు సంక్రాంతి సీజన్ ప్రారంభం కావడంతో వంగ ధరలు ఒక్కసారిగా పుంజుకొన్నాయి.

బెంగళూరు,చెన్నైలో మంచి డిమాండ్

మన జిల్లాలో సాగు చేసే వంకాయలకు బెంగళూరు, చెన్నైలో మంచి డిమాండ్ ఉంటుంది. ముఖ్యంగా మద్రాసు రకం వంకాయలకు అక్కడి మార్కెట్లో మంచి ధరలు పలుకుతున్నాయి. ఇక్కడ సాగు చేసే వంకాయలను తిరుపతి, కడప, చెన్నై, బెంగళూరు మార్కెట్లకు ఎగుమతి చేస్తుంటారు. కొన్ని ప్రాంతాల్లో బయటి రాష్ట్రాల వ్యాపారులే నేరుగా తోటల వద్దకు వచ్చి కాయల్ని కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. ప్రస్తుతం కోతకూలీలు, రవాణాఖర్చులు,పెట్టుబడి సాగు ఖర్చులు పోనూ రైతులు లాభాలు చవిచూస్తున్నారు.

వంగ సాగు లాభసాటిగా ఉంది



ప్రస్తుతం మిగతా పంటలతో పోల్చుకుంటే వంగతోటల సాగు లాభసాటిగా ఉంది. వంగతోటల సాగు మమ్మల్ని ఆదుకొంటోంది.
– రాజమ్మ, కొత్తపల్లె

రెండు ఎకరాలలో సాగు చేశా



రెండు ఎకరాల పొలంలో మద్రాసు రకం వంగ సాగు చేశా. మార్కెట్లో వీటి ధరలు బాగానే ఉన్నాయి. రైతులకు ఊరట కలుగుతోంది.
– రెడ్డిమోహన్, రైతు, చెరువుమొరవపల్లె

అదనపు కట్నం వేధింపులపై కేసు

కలకడ : వివాహిత మహిళను అదనపు కట్నం కోసం వేధించిన భర్తపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ సునీల్‌కుమార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోన పంచాయతీ బంగారువాండ్లపల్లె గ్రామానికి చెందిన షాహిదాకు (ప్రస్తుతం మహిళాపోలీస్ నడిమిచెర్ల) కలకడ టౌన్ దిగువీధికి చెందిన షమీవుల్లాతో 2021లో వివాహమైంది. వివాహసమయంలో నగదు, బంగారు ఇచ్చారు.అదనంగా రూ. 3లక్షలు తీసుకురావాలని, లేకపోతే ఇంటిలోకి రావొద్దని వేధిస్తునట్లు బాధితురాలు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

రైలు కిందపడి వృద్ధురాలి మృతి

పుల్లంపేట : పుల్లంపేట మండలంలోని అప్పయ్యరాజుపేట రైల్వేకోడూరు సమీపంలో సోమవారం గుర్తు తెలియని వృద్ధురాలు (75) రైలు కిందపడి మృతి చెందినట్లు రేణిగుంట రైల్వేపోలీస్ ఎస్ఐ అనీల్ కుమార్ తెలిపారు. మృతురాలు ఆకు పచ్చ రంగు చీర ధరించి ఉందన్నారు. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు 9292403084 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలు

మదనపల్లె : రెండు వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లెకు చెందిన శివప్రసాద్(28) వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో బొంతలవారిపల్లె నుంచి మదనపల్లెకు వస్తుండగా మార్గమధ్యలో కుక్క వాహనానికి అడ్డురావడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడ్ని 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అవుట్‌పోస్ట్ సిబ్బంది నిమ్మనపల్లె పోలీసులకు సమాచారం అందించారు. అదేవిధంగా పట్టణంలోని సప్తగిరినగర్‌కు చెందిన శ్రీనివాసులు(48) వాహనంలో టీ వ్యాపారం చేస్తూ పొన్నూటిపాళ్యం మార్గంలో వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనంలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలు

మదనపల్లె : పిచ్చికుక్క దాడిలో ఐదుగురు గాయపడిన సంఘటన సోమవారం పట్టణంలో జరిగింది. బసినికొండ పుంగనూరు రోడ్డులో నివాసం ఉంటున్న పలువురిపై పిచ్చికుక్క దాడిచేసి కరిచింది. ఈ దాడిలో బాలమ్మ(65) చేతి వేలిని కుక్క పూర్తిగా కొరికివేసింది. ఆమెతో పాటుగా జ్యోత్స్న, సునీత, అల్లాబక్షును కుక్క కరవడంతో వాళ్లు గాయాల పాలయ్యారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సలు పొందారు. ఈ సందర్భంగా బాధితురాలు బాలమ్మ మాట్లాడుతూ.. తమ ప్రాంతంలో కుక్కల బెడద అధికంగా ఉందని పలుమార్లు అధికారులకు ఫిర్యాదుచేసినా ఎవరూ పట్టించుకోలేదని వాపోయింది.


గాయపడిన బాలమ్మ

సాగు పెరిగి.. ధర తగ్గి..

- టమాట రైతుకు నష్టాలు
- గత ఏడాది మేలో కిలో ధర రూ.92
- 2023 మేలో కిలో అత్యధిక ధర రూ.32



బి.కొత్తకోట : రైతు ఒకటి తలిస్తే.. ధరలు మరొకటి తలచాయి అన్నట్టుంది టమాట రైతుల పరిస్థితి. 2022 మేలో మంచి ధరలు పలకడంతో ఈ సంవత్సరం కూడా ధరలు అదే విధంగా ఉంటాయని భావించి మే నెలలో దిగుబడులు అందేలా టామాట పంట సాగు చేశారు.అప్పటి ధరలు ప్రస్తుతం పలకకపోవడంతో నష్టాలను మూట కట్టుకున్నారు. తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల్లో రైతులు కట్టెలతో పంటను సాగు చేస్తారు. దీనికి ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.1.30 లక్షల దాకా పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. ధరలు ఆశాజనకంగా ఉంటే సరే లేదంటే నష్టాలే. ఇదే పరిస్థితి ప్రస్తుతం సాగులోని టమాట పంటకు వర్తిస్తోంది. తంబళ్లపల్లె నియోజకవర్గంలో 1,200 ఎకరాల్లో, మదనపల్లె నియోజకవర్గంలో 700 ఎకరాల్లో టమాట సాగులో ఉంది.

పెరిగిన దిగుబడులు

మదనపల్లె, ములకలచెరువు వ్యవసాయ మార్కెట్ యార్డులకు ఈ మేనెలలో అత్యధికంగా టమాట దిగుబడులు వచ్చాయి. మే నెలలో ఉష్ణోగ్రతలు పెరగడం, దిగుబడులపై ప్రభావాన్ని చూపుతాయి. అయితే గత మే నెలలో మాత్రం దిగుబడులు భారీగా వచ్చాయి. పంట సాగు విస్తీర్ణం గతంలోకంటే పెరిగింది. మదనపల్లె మార్కెట్‌కు 2022 మేలో 6,789 టన్నుల టమాట విక్రయానికి వచ్చింది. ప్రస్తుత మేలో 23,826 టన్నులు వచ్చాయి. అంటే 17,037 టన్నుల అధిక దిగుబడులు వచ్చాయి. ములకలచెరువు మార్కెట్‌కు 2022 మేలో 1,716 టన్నుల టమాట రాగా, ప్రస్తుత మేలో 3,378 టన్నులు వచ్చాయి. అంటే 1,662 టన్నుల అధిక దిగుబడి వచ్చింది. అలాగే అంగళ్లు మార్కెట్‌కు వస్తున్న టమాట లెక్కలను అధికారులు తీయడం లేదు. దీంతో ఇక్కడ ఎంత దిగుబడి విక్రయానికి వస్తోందో తెలియడం లేదు. ఈ మార్కెట్‌కు వచ్చే దిగుబడులు కలుపుకుంటే ప్రస్తుత మేలో అత్యధిక టమాట దిగుబడులు వచ్చాయి. ములకలచెరువు, అంగళ్లు మార్కెట్లు తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందినవి. ఈ టమాట దిగుబడులంతా తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాలనుంచే వచ్చిందే. అందులో తంబళ్లపల్లెది మొదటిస్థానం. రాష్ట్రంలో అత్యధిక టమాట సాగు తంబళ్లపల్లెలోనే ఉంది.

గతేడాది అత్యధిక ధరలు

గత ఏడాది మేనెలలో మదనపల్లె, ములకలచెరువు మార్కెట్లలో టమాట పంటకు అత్యధిక ధరలు పలికాయి. మదనపల్లె మార్కెట్‌కు 2022 మే నెలలో 6,789 టన్నులు విక్రయానికి వచ్చాయి. ఈనెలలో అత్యధికంగా కిలో టమాట రూ.92 పలికింది. ఈ ధర మార్కెట్ చరిత్రలోనే అధికం కావడం విశేషం. ఈ మేనెలలో ధరలు ఇలాగే పలుకుతాయని రైతులు ఆశించారు. ఫలితంగా సాగు విస్తీరణం పెంచేశారు. దీంతో గత మేనెలలో మదనపల్లె మార్కెట్‌కు 2,382 టన్నుల టమాట విక్రయానికి వచ్చింది. మే నెలలో ఈ స్థాయిలో టమాట విక్రయానికి రావడం అత్యధికం. పంటకు ధరలు పలకలేదు. నెల పొడవునా కిలో రూ.9.60 నుంచి రూ.13 వరకు ధర పలికితే చివరి నాలుగు రోజులు మాత్రం ఊరట లభించింది. 28వతేదీన కిలో టమాట రూ.13, 29న రూ. 24, 30న రూ. 32, 31న రూ.32 పలికింది. 2022 మేనెలలో తంబళ్లపల్లె నియోజకవర్గం ములకలచెరువు మార్కెట్‌కు 1,716 టన్నుల టమాట విక్రయానికి రాగా అత్యధికంగా కిలో ధర రూ.84 పలికింది. ఇదే మార్కెట్‌కు మేనెలలో 3,378 టన్నుల టమాట విక్రయానికి వచ్చింది. ఈ నెల పొడవునా అధికంగా కిలో ధర రూ.10 పలికింది. నెల చివరల్లో 28న రూ.11, 29న రూ.16, 30న రూ.16, 31న రూ.18 పలికింది.

దిగుబడి పెరగడం వల్లే



గత ఏడాది మేలో దిగుబడులు తక్కువ కారణంగా ఇతర ప్రాంతాలకు చెందిన కొనుగోలుదారులు ఇక్కడి మార్కెట్లపై ఆధారపడటం వల్ల ధరలు అధికంగా పలికాయి. ప్రస్తుత మేలో దిగుబడులు అధికం కావడంతో కొనుగోలుదారులు ఇక్కడి మార్కెట్లపై ఆధారపడలేదు. దీనివల్లే ప్రస్తుతం మేలో ధరలపై ప్రభావం చూపింది.

-జగదీష్ వెంబలి, మార్కెట్ కార్యదర్శి, ములకలచెరువు

ఏడెకరాలలో సాగు చేశా



2022 మేలో రెండు ఎకరాల్లో రూ.3 లక్షల పెట్టుబడితో టమాట సాగుచేస్తే రూ.6లక్షల లాభం వచ్చింది. ఈ ధరను నమ్ముకుని ప్రస్తుతం ఏడు ఎకరాల్లో విడతలవారీగా టమాట సాగుచేశా. ఐదు ఎకరాలపై పెట్టిన పెట్టుబడి రూ.7.50 లక్షలు పూర్తిగా నష్టపోయాను. మే నెలలో ధరలు లేకపోవడంతో మూడు ఎకరాల్లో పంటను పొలం నుంచి తీయకుండా వదిలేశాను. ఐదురోజులుగా ధరలు పలుకుతున్నందున మిగిలిన రెండు ఎకరాల్లోని పంటలో లాభాలు వస్తాయని ఆశతో ఉన్నా.

-జి.నరసింహారెడ్డి, టమాట రైతు, గౌడసానిపల్లె, తంబళ్లపల్లె మండలం

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

మదనపల్లె : డిగ్రీ విద్యార్థిని అదృశ్యంపై సోమవారం కేసు నమోదుచేసినట్లు టూటౌన్ ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎస్టేట్‌లో నివాసం ఉంటున్న నసీబ్‌జాన్ కుమార్తె మోఫీదా(20) ఈనెల 3న కళాశాలకు వెళుతున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది. అయితే సాయంత్రం ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల వద్ద విచారించినప్పటికీ ఆచూకీ లభించకలేదు. దీంతో తల్లి నసీబ్‌జాన్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదుచేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బావిలో పడి వ్యక్తి మృతి

కలికిరి: బావిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన కలికిరిలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కలికిరి పట్టణ పరిధిలో క్రాస్‌రోడ్డు సమీపంలో ఓ వ్యవసాయ బావిలో మృతదేహం తేలియాడుతున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడు పట్టణంలోని ఏఎస్ఆర్ కాలనికి చెందిన వి.రామకృష్ణ(34)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మృతుడి భార్య గంగాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు పట్టణంలో ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు, ఇతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. బొమ్మనచెరువు పంచాయతీ టేకులపాళెంకు చెందిన కిశోర్ భార్య జి.యశోద (27) కుటుంబసమస్యలతో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం కోలుకుంటోంది.

మార్కెట్‌యార్డులో ఘర్షణ


దాడిలో గాయాలయ్యాయని చూపుతున్న మినీ లారీ డ్రైవర్ రాజేష్

మదనపల్లె : పట్టణంలోని మార్కెట్‌యార్డులో సోమవారం మినీ లారీ డ్రైవర్, రైతు మధ్య జరిగిన ఘర్షణ జరిగింది. ఉదయం 7.30 గంటల ప్రాంతంలో బి.కొత్తకోటకు చెందిన రైతు బొలేరో వాహనంలో టమాటాలను తీసుకొచ్చి టీవీఎస్ మండీ వద్ద దింపుతున్నాడు. సరిగ్గా అదే సమయానికి ఐషర్ లారీ డ్రైవర్ రాజేష్ తన వాహనాన్ని బయటకు తీసుకువచ్చేందుకు ప్రయత్నించాడు. ఈక్రమంలో ఐషర్ లారీ వెళ్లేందుకు రైతు బొలేరో వాహనం రోడ్డుపై అడ్డుగా ఉండటంతో తొలగించాల్సిందిగా కోరాడు. రైతులు టమాటాలు మార్కెట్‌కు తీసుకొచ్చేటప్పుడు లారీలు లోనికి రాకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ ఎందుకు రావాల్సి వచ్చిందని డ్రైవర్‌ను ప్రశ్నించాడు. టమాటాలు అన్‌లోడ్ చేశాక తీస్తామని చెప్పడం, దానికి డ్రైవర్ రాజేష్ అంగీకరించకపోవడం.. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఒకరిపై ఒకరు దాడిచేసుకునే పరిస్థితులకు దారితీశాయి. రైతు సరుకు దింపి వెళ్లిపోయాక.. డ్రైవర్ రాజేష్ ఇతర డ్రైవర్లతో కలిసి రైతు తనపై దాడికి పాల్పడినందుకు నిరసనగా మార్కెట్ నుంచి ఇతర వాహనాలను వెళ్లనిచ్చేది లేదంటూ నిరసనకు దిగాడు. దీంతో మార్కెట్‌యార్డు సెక్రటరీ అభిలాష్ టూటౌన్ పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడకు చేరుకుని డ్రైవర్లకు నచ్చజెప్పి పంపివేశారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య : ఆర్జేడీ


మాట్లాడుతున్న ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి

ఓబులవారిపల్లె : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధనతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు ప్రపంచ స్థాయికి ఎదగడమే లక్ష్యంగా ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందిస్తోందని ఆర్జేడీ ఎం వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం తల్లెంవారిపల్లె నూతన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆర్జేడీ పరిశీలించారు. ఈసందర్భంగా గ్రామప్రజలు, ఉపాధ్యాయులు, జిల్లా స్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సీఎం సలహాదారులు ఆర్ ధనుంజయరెడ్డి సహకారంతో మూరుమూల గ్రామం తల్లెంవారిపల్లె ప్రాథమిక పాఠశాలను ఉన్నత పాఠశాలగా మంజూరు చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. నాడు నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ బడుల రూపురేఖలు పూర్తిగా మార్చి కార్పోరేట్‌కు దీటుగా వసతులు కలిపించారని అన్నారు. జగనన్న గోరుముద్దతో పౌష్టికాహారం అందిస్తున్నారని, అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. తల్లెంవారిపల్లెలో దాదాపు రెండుకోట్ల అరవైలక్షల రూపాయలతో అన్ని సౌకర్యాలు కలిగిన నూతన పాఠశాల భవనాలు నిర్మించనున్నట్లు తెలిపారు.చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నూకనపల్లె తదితర గ్రామాల విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా ఉంటుందని తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ వరలక్ష్మి, ఎంఈఓ పద్మజ, ఎస్టీయూ నాయకులు ఆదినారాయణరెడ్డి, మజీ ఎంపీపీ రామకృష్ణయ్య, వైఎస్సార్ పార్టీనాయకులు కోమ్మూరు భాస్కర్‌రెడ్డి, కోమ్మూరు నారాయణరెడ్డి, కోమ్మూరు శంకర్‌రెడ్డి, చిన్నిరెడ్డి గురివిరెడ్డి, సూదీర్‌రెడ్డి, ఆశోకెరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, హెచ్‌ఎం సుబ్బారాయుడు, ఉపాధ్యాయులు నరసింహరెడ్డి, రవికూమార్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌షాపులపై విజిలెన్స్ దాడులు

మదనపల్లె : పట్టణంలోని రేషన్‌షాపులపై సోమవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ సీఐ ఈదురుబాషా ఆధ్వర్యంలో సిబ్బంది పట్టణంలోని నక్కలదిన్నె, గొల్లపల్లె, సీరుగట్టువారిపల్లె మార్కెట్‌యార్డు ఎదురుగా ఉన్న రేషన్‌షాపు నంబర్. 1, 41, 35 దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు చేశారు. స్టాక్‌పాయింట్ నుంచి రేషన్‌షాపునకు వచ్చిన స్టాక్, వినియోగదారులకు పంపిణీ చేయగా మిగిలిన నిల్వ వివరాలు, ఈపోస్ యంత్రంలో నమోదైన వివరాలు తదితరాలపై తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ ఈదురుబాషా మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా సోదాలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏఓ బాలగంగాధరరెడ్డి, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

చిన్నమండెం : మండల పరిధిలోని దిగువగొట్టివీడు గ్రామం బలిజపల్లెకు చెందిన అశ్విని(22) కనిపించలేదని ఆమె భర్త అశోక్‌కుమార్ ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఈ నెల 2వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదన్నారు. బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాకపోకలకు 'ఇసుక టిప్పర్' బ్రేక్!


రాజంపేట-రాయచోటి ఘాట్‌రోడ్‌లోని మలుపులో నిలిచిపోయిన ఇసుక టిప్పర్

రాజంపేట : జిల్లా కేంద్రమైన రాయచోటి-రాజంపేట ఘాట్‌రోడ్‌లో సోమవారం వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆదివారం రాత్రి బాలరాచపల్లె వద్ద ఇసుకను తరలిస్తున్న టిప్పర్ ఘాట్‌రోడ్ తీవ్ర మలుపులో ఆగిపోయింది. దీంతో రాత్రి నుంచి వాహనాలు తిరగలేదు. బస్సులతో పాటు పలు ప్రైవేటు వాహనాలు ఘాట్ వెంబడి నిలిచిపోయాయి. ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు.

కడపమీదుగా జిల్లా కేంద్రానికి..

రాజంపేట-రాయచోటి ఘాట్‌రోడ్డులో వాహనాలు రాకపోకలు నిలిచిపోవడంతో విధిలేని పరిస్థితిలో కడపకు వెళ్లి, అక్కడి నుంచి జిల్లాకేంద్రమైన రాయచోటికి తరలివెళ్లారు. నిత్యం వివిధ ప్రభుత్వ ఉద్యోగులు, అత్యవసర పనుల మీదు వెళ్లే వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. రాయచోటి, రాజంపేట డిపో బస్సులు ఘాట్‌లో ఎక్కడకక్కడే నిలిచిపోయాయి. ఇసుక టిప్పర్‌ను కదిలించే సన్నహాలు చేశారు. ఫలితంగా ఉదయం 10 గంటలకు ట్రాఫిక్ క్లియర్ అయింది. ఈ విషయాన్ని రాజంపేట ఆర్టీసీ డిపో మేనేజరు రమణయ్య ధ్రువీకరించారు.

కేసు భయంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం


విద్యుత్‌పోల్ నుంచి బాధితున్ని కిందకు దింపుతున్న తాలూకా పోలీసులు, స్థానికులు

మదనపల్లె : పోలీస్‌స్టేషన్‌లో తనపై కేసు పెడతారన్న భయంతో ఓ వ్యక్తి అదే పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న విద్యుత్ పోల్ ఎక్కి ట్రాన్స్‌ఫార్మర్ పట్టుకుని ఆత్మహత్యకు యత్నించిన ఘటన సోమవారం రాత్రి 9.30 గంటల సమయంలో తాలూకా పోలీస్‌స్టేషన్ ఎదుట జరిగింది. మదనపల్లె మండలం సీటీఎం పంచాయతీ చిలకవారిపల్లెకు చెందిన గోపయ్య కొడుకు ఏసు(32) స్థానికంగా టైలర్‌గా పనిచేస్తూ చిల్లర దుకాణం నిర్వహిస్తున్నాడు. అతనిభార్య రేఖ గ్రామవలంటీర్‌గా పనిచేస్తోంది. అయితే గౌడసానివారిపల్లె నుంచి ఏడాది క్రితం చిలకవారిపల్లెకు వచ్చి నివాసం ఉంటున్న మరోమహిళతో ఏసుకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈక్రమంలో సోమవారం సాయంత్రం ఆ మహిళ కుటుంబీకులు ఏసుపై తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసేందుకు వెళ్లారు. విషయం తెలుసుకున్న ఏసు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని కేసు పెడితే తనను కొడతారన్న భయంతో, పరువు పోతుందన్న కారణంతో మనస్తాపం చెంది విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకుని ఆత్మహత్యకు యత్నించాడు. విద్యుత్‌పోల్ ఎక్కడాన్ని గమనించిన స్థానికులు బిగ్గరగా అరుస్తూ విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు వెంటనే అప్రమత్తమై తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాను ఆపివేశారు. దీంతో ఏసు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. వెంటనే పోలీసులు, స్థానికులు విద్యుత్ పోల్ నుంచి బాధితున్ని కిందకు దించారు. ఏసును తాలూకా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ సుధాకర కౌన్సిలింగ్ చేశారు. అతడిపై మహిళ కుటుంబీకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

చిన్నమండెం : గత నెల 29వ తేదీన ఆత్మహత్యకు యత్నించిన వేల్పుల నాగరాజ(61) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. మండలంలోని మల్లూరు కస్పాకు చెందిన నాగరాజ మే 29వ తేదీన ఉరి వేసుకున్నాడు. బంధువులు అతన్ని తిరుపతి స్విమ్స్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడన్నారు. మృతుడిని కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అపార్థాలకు తావివ్వకూడదు


కలసి జీవించేందుకు ఆమోదం తెలిపిన దంపతులతో జిల్లా ఎస్పీ గంగాధర్ రావు

రాయచోటిటౌన్ : ఓ చిన్న అపార్థం కాపురాన్ని విచ్ఛిన్నం చేస్తుందని అన్నమయ్య జిల్లా ఎస్పీ గంగాధర్ రావు పేర్కొన్నారు. తన భర్త తనను మానసిక, శారీరకంగా హింసిస్తున్నాడని జిల్లా ఎస్పీకి ఓ మహిళ స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసింది. ఎస్పీ వెంటనే స్పందించి భార్యాభర్తలను వేరువేరుగా, తరువాత ఒకే వేదికపై కౌన్సెలింగ్ నిర్వహించారు. వారు తమ తప్పును తాము తెలుసుకొని కలసి జీవించేందుకు సిద్ధపడ్డారు. తమ పిల్లలనుతమ దగ్గరకు తీసుకొన్నారు. దీంతో ఇద్దరినీ జిల్లా ఎస్పీ అభినందించారు. సయోధ్య కుదిర్చారు. ఈ కార్యక్రమంలో దిశ పోలీసులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

రాయచోటి : స్పందన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ''స్పందన'' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్పందన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు వారి సమస్యలను స్వయంగా జిల్లా ఎస్పీకి విన్నవించారు. స్పందన కార్యక్రమంలో 47 పిటీషన్లను ఎస్పీ స్వీకరించారు.